POW

మహిళా గొంతుక

# మాతృక

ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యు) అధికార మాసపత్రిక

MAHILA GONTUKA MATRUKA

సంపుటి : 2 సంచిక : 12 అక్టోబర్ - 2016 పేజీలు : 48 వెల : 15 రూ.లు

జారులపై కైజారులు దూసి - దోపిడి కోటలు కూల్చిన చోట
ప్రపంచ చరితలో మొదటిసారిగా - విప్లవాన్ని విరచించిన చోట
సామ్యవాదపు విరితోటలో - విరబూసిన మహిళలెందరో ...



1917 - 2017

అక్టోబరు విప్లవ శతాబ్ది సంవత్సర ప్రారంభం

13

POW

మహిళా సంఘటిత శక్తి
ఉద్యమించే మహిళల ఊపిరి

మహిళా గొంతుక

# మాతృక

MAHILA GONTUKA MATRUKA

సంపుటి :2 సంచిక : 12 పేజిలు : 48 అక్టోబర్ - 2016

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| మాతృక మాట | : ఉమ్మడి పౌర స్మృతి – సందర్భం | | 4 |
| శ్రామిక | : రెడీమేడ్ దుస్తుల రాకతో చప్పుడాగిపోతున్న కుట్టుమిషన్లు | బి. పద్మ | 6 |
| కతలు వెతలు | : చోటు | బమ్మిడి జగదీశ్వరరావు | 10 |
| ప్రత్యేక వ్యాసం | : ఊయలలూపిన చేతులే ఉక్కుపిడికిళ్ళై.... | సంయుక్త | 13 |
| సీరియల్ | : అపరాజిత | రచన: మేరీ క్రౌ డాగ్ : రిచర్డ్ ఎర్డోస్ అనుసృజన : మమత కొడిదెల | 18 |
| వివక్ష | : మహిళా బిల్లు ...ఓ ఆరాటం... | వి. సంధ్య | 21 |
| కథ | : ద్రౌపది | మూల రచన : మహా శ్వేతాదేవి ఇంగ్లీష్ అనువాదం : గాయత్రీ చక్రవార్తీ స్పివాక్ తెలుగు అనువాదం : ల.లి.త. | 26 |
| నివాళి | : కామ్రేడ్ బొజ్జా తారకం గారికి విప్లవ జోహార్లు | | 33 |
| వెలుతురు పిట్టలు | : స్వావలంబనకు ప్రతీక మధురవాణి | ఎస్.జె.కల్యాణి | 34 |
| ఆరోగ్యం | : మహిళలు – క్యాన్సర్ | వి. పద్మ | 37 |
| తెర | : ఆఫ్ఘన్ మహిళల దుస్థితికి అద్దం పట్టిన చిత్రం "సఫర్ ఏ గాందెహార్" | కె.పి. అశోక్ కుమార్ | 38 |
| అక్షర సంస్మరణ | : అక్షరాలను రగిలించిన మహాశ్వేతాదేవి | రమాసుందరి | 40 |
| ఇంకెంత దూరం | : బస్ ఫ్రస్ట్రేషన్ | సూర్యకుమారి. టి | 42 |
| డిమాండ్ | : ఏపీకి ప్రత్యేక హోదా కావాలి | | 44 |
| | ఆదివాసీల జిల్లాలను ఏర్పాటు చేయాలి | | 45 |
| ఉద్యమ గమనం | : | | 46 |
| గుండె చప్పుడు | : అద్దె గర్భం | శివపార్వతి | 20 |
| | : శ్మశాన శాంతి | శారద శివవరపు | 2 |
| | : ఏకపక్ష (పాత) విచారణ | టి. చంద్రశేఖర్ రెడ్డి | 48 |
| చిత్ర దర్శనం | : ఆకుపచ్చని శ్వాసలు | నిర్మలారాణి తోట | 47 |


ముఖచిత్ర డిజైన్ : ధరణి
బొమ్మ : మాగ్జిం గోర్కీ రాసిన 'అమ్మ' నవల ఆధారంగా తీసిన 'ద మదర్' పోస్టర్
బొమ్మ కర్టెసీ : కరుణాకర్
ముఖచిత్ర కవిత : శక్తి

**ఎడిటర్**
చొప్పర పద్మ

**సంపాదకవర్గం**
వి. సంధ్య
ఎన్. విష్ణు
బి. రమాసుందరి

**రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక సమానత్వం కోసం పోరాడుదాం**

ధరణి ఎంటర్ ప్రైజెస్
డిటిపి & డిజైనింగ్
హైదరాబాద్

ముద్రణ : నవ్య ప్రింటర్స్,
హిమాయత్ నగర్, హైదరాబాద్ - 29

రచనలు, చందాలు పంపవలసిన చిరునామా

మహిళా గొంతుక
మాతృక

ఇం.నెం. 35-3-6931 (4)
కామ్రేడ్ మాదాల నారాయణ స్వామి భవన్, సంజయగాంధీ కాలనీ,
శర్మ కాలనీ దగ్గర,
ఒంగోలు – 523 001
సెల్ : 9676206230
ఫోన్ : 08592 – 238350
e-mail : matruka2015@gmail.com

మాతృక మాట

# ఉమ్మడి పౌర స్మృతి - సందర్భం

ఉమ్మడి పౌరస్మృతి సంగతి మళ్ళీ రంగంలోకి వచ్చింది. ఇంతకు ముందు సాధారణ పౌరస్మృతిగా పిలిచిన ఈ రాజ్యాంగ స్మృతికి 'సాధారణ (Common)' అనే పదం సరైన అర్థాన్ని యివ్వటం లేదని 'ఉమ్మడి (Uniform)' గా మార్చారు. 'ఒక దేశం-ఒక చట్టం' అనే బీజేపీ మొండి నినాదం మళ్ళీ ఈ స్మృతికి అంకురార్పణ చేసింది. కాంగ్రెస్ తన హయమంతా ఒక వైపు ముస్లిం ఓట్ల కోసం ఊగిసలాడుతూ, రెండో వైపు తన ఉదారవాద ముఖాన్ని ప్రదర్శించుకోవాలనే తాపత్రయ పడుతూ - కొంత కాలం నాటకాలు ఆడి ఈ విషయాన్ని ముగించింది. ఇప్పుడు బీజేపీ మళ్ళీ ఉమ్మడి పౌర స్మృతి, దాని ఆచరణకు సంబంధించి పరిశీలించమని లా కమీషన్‌కు ఒక ఉత్తరం రాసి ఈ ప్రహసనానికి మళ్ళీ తెర ఎత్తింది.

రాజ్యాంగ రచన జరిగినపుడే అన్ని మతాలకు సంబంధించిన పర్సనల్ చట్టాలలో వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత అనే విషయాల వరకు ఉమ్మడి స్మృతి వుండాలని వాదించిన వాళ్ళు ఉన్నారు. జండా మార్పిడి తరువాత జరిగిన మారణహోమం దాన్ని ఆర్టికల్ 44లో కేవలం ఆదేశిక సూత్రంగానే కూర్చోబెట్టింది. పర్సనల్ చట్టాలలో వివాహ విషయాలు, విడాకుల సంగతులు, ఆస్తి హక్కులు, వారసత్వ వివరాలు పొందుపరిచి ఆయా మతాలలో వేరు వేరుగా ఆచరించాలని చెప్పటంలోనే మహిళలు వీటికి ముడిపడి ఉన్నారు. ఈ పర్సనల్ చట్టాలలోని మత ప్రార్ధనలు జరుపుకోవడం, మతాచారాలను పాటించడం, మత వివాహాలు జరుపుకోవడం లాంటి సంగతులను మినహాయించి మిగతా అన్ని విషయాలను ఉమ్మడి చట్టం కిందకు తీసుకొని రావాలన్నదే ఉమ్మడి పౌర స్మృతి అంతరార్థం. ఆస్తి హక్కు, పునరుత్పత్తి హక్కు, విడిపోయే హక్కు, కోరిన వాడిని పెళ్లాడే హక్కుల నుండి వెలివేతకు గురి అయిన మహిళల కంటే ఇంక ఎవరికి ఎక్కువ ఈ పౌర స్మృతితో సంబంధం ఉంటుంది?

ఉమ్మడి పౌరస్మృతి ఇప్పుడు దేశం మొత్తం మీద గోవాలోనే అమలు అవుతున్నది. అందులో నేతిబీరకాయలో ఉన్న నెయ్యంత కూడా ఉమ్మడితనం, జండర్ న్యాయం లేవు. ఈ చట్టం ఎవరు విడాకులు కోరితే వారి వైపు నిలబడుతుంది. సహజంగా పురుషులే ఎక్కువగా భార్యను వదిలి వేయగలరు కాబట్టి వారి పక్షానే ఈ చట్టం నిలబడుతుంది. హిందువులలో ఉండే బహుభార్యత్వంతో సహా గోవాలో హిందువుల ఆచారాలు, అలవాట్లు అలాగే ఉంటాయి. గృహహింస విషయంలో ఈ పౌరస్మృతి ఎలాంటి ప్రభావం చూపించినట్లు ఆధారాలు లేవు. జండర్ న్యాయానికి ప్రాధాన్యత యివ్వక పోతే ఉమ్మడితనం, అది నీరు కారటం .. యివి రెండూ పితృస్వామ్యానికీ, మెజారిటీతత్వానికి బలాన్నియిస్తాయి.

ఇప్పుడు ఈ ఉమ్మడి పౌరస్మృతి గురించి బీజేపీ పట్టించుకోవటంలో అనేక సందేహాలు వస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముస్లిములను విలన్లలాగా చిత్రీకరిస్తున్న నేపథ్యం ఉంది. ఇంకో పక్క ముస్లిములను శత్రువులుగా పరిగణించి దేశం నుండి తరిమి వేయాలని బహిరంగ ప్రకటనలు యిస్తున్న సంఘ పరివార్ ఆధీనంలో ఉన్న ప్రభుత్వం అందరికి సాధారణ చట్టాన్ని ప్రతిపాదిస్తుందా లేక మెజారిటీవాదాన్ని ఈ చట్టంలో ప్రతిపాదిస్తుందా అనే సందేహం వస్తుంది. బీఫ్ బాన్ విషయంలో, స్కూళ్ళనూ కాలేజీలనూ కాషాయీకరణ చేయటంలో, లవ్ జిహాద్ విషయంలో అత్యుత్సాహం చూపించిన ప్రభుత్వం ఈ సాధారణ చట్టం అన్ని మతాలకు న్యాయం చేకూరుస్తుందనే నమ్మకాన్ని యివ్వలేక పోతోంది.

రెండోది ఉమ్మడి పౌర స్మృతి ఆయా మతాలలోని ఏ విషయాలను ఉమ్మడిగా తీసుకొంటుంది అనే విషయం. అన్ని మతాలలో ఉన్న మంచి విషయాలను ఉమ్మడిగా ప్రతిపాదిస్తుందా లేక మెజారిటీ మతమైన హిందూ మతంలోని అభ్యుదయేతర విషయాలను ప్రతిపాదిస్తుందా? హిందూ వివాహ చట్టంలో అనుమతించక పోయినా, హిందూ మతంలో ఆచరణలో ఉన్న బహుభార్యత్వం గురించి ఈ స్మృతి ఏమి చెప్పబోతుంది? హిందూ పర్సనల్ లా ప్రకారం హిందూ అవిభక్త కుటుంబాలలో ఉన్న పన్ను రాయితీల గురించి ఈ చట్టం ఏమి మాట్లాడబోతుంది? ఆ రాయితీలు అన్ని మతాలలో లేవు కాబట్టి తీసివేయబోతుందా? లేక అన్ని మతాలలోని ఉమ్మడి కుటుంబాలకు ఆ రాయితీలను ప్రసాదించబోతుందా? పోనీ ఈ చట్టం చాలా మంది ఆశించినట్లుగా అన్ని మతాలలోని స్త్రీలకు జండర్ న్యాయం చేయబోతుందని అనుకొంటే ఆస్తి మీద సమాన హక్కు స్త్రీ పురుషులకు యివ్వబోతుందా? విడాకుల సమయంలో స్త్రీల ఆస్తిని ఆమెకు అందచేసే సదుపాయం ఉంటుందా? ఇది మైనారిటీ మతాల్లో ఉన్న బహుభార్యత్వం లాంటి అనాగరిక ఆచారాలను పారదోలుతుందని అంటున్నారు. మరి మెజారిటీ మతమైన హిందూ మతంలో చట్టానికి అతీతంగా అమలు అవుతున్న బహుభార్యత్వాన్ని ఏమి చేస్తారు? ఇత్యాది ప్రశ్నలు వస్తున్నాయి.

హిందూ మతంలో రెండో భార్యలు ఉంపుడుగత్తెలుగానే పరిగణించబడతారు కాని వారికి ఎలాంటి హక్కులూ ఉండవు. ముస్లిం మతంలో భర్త వదిలేసిన భార్యలకు 'మెహర్' రూపంలో కొంతైనా ముడుతుంది. నిజానికి ముస్లిం పర్సనల్ లా స్వాతంత్ర్యానంతర కాలంలో కొంత ఆధునీకరణ చెందింది. ఆ మతంలో వివాహం ఒక కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగుతుంది. వివాహం రద్దయిన తరువాత స్త్రీలకు కొన్ని హక్కులు ఉంటాయి. అలాగని ముస్లిం స్త్రీలు హిందూ స్త్రీల కంటే మెరుగ్గా ఉన్నారని కాదు. అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో ముస్లిం మహిళలు కునారిల్లుతుంటారు. ట్రిపుల్ తలాక్, బహుభార్యత్వం ఈ మహిళలను కుంగదీస్తున్నాయి. సంచార్ కమిటీ నివేదిక ప్రకారం గత పది సంవత్సరాలలో ముస్లిం మహిళలు మరింత పేదరికంలోకి దిగజారారు.

ఉమ్మడి పౌర స్మృతి దేశ సమగ్రతను పెంచుతుందని మరో వాదన. ఇటీవల వెంకయ్య నాయుడు ఇదే విషయాన్ని ఒక ఆంగ్ల పత్రికలోని పెద్ద పేజీ అంతా ప్రవచించాడు. దేశ సమగ్రత అంటే బీజేపీ అభిప్రాయం ఏమిటో సామాన్య పౌరులకు కూడా స్పష్టం అవుతున్నదిప్పుడు. దేశ సమగ్రత అంటే మైనారిటీ మతస్తులు, ముఖ్యంగా ముస్లిములు అణిగిమణిగి పడి ఉండటమే. ముస్లిములను ఉమ్మడి పౌరస్మృతి అనే పనిముట్టుతో బాదదలుచుకొన్నదా అనే సందేహం అతి సహజం. స్త్రీ పురుష సమానత్వానికి సంబంధించిన అంశాలు ఏమీ లేకుండా బీఫ్ బాన్ లాగానో, అయోధ్యాలాగానో ఉమ్మడి పౌరస్మృతిని ఒక హిందుత్వ అజండాగా ముందు తీసుకొని వస్తుందన్న విషయం నిర్వివాదం. దేశ సమగ్రత నినాదం కింద 'హిందూ రాష్ట్ర' 'లవ్ జిహాద్' అమలు చేసే ప్రయత్నంలో బీజేపీ ప్రభుత్వం ఉంది. ముస్లిం అధిక సంతానాన్ని పదే పదే అందుకు కారణం చూపెడుతూనే ఉంది. లవ్ జిహాద్ అమలు చేయాలని పట్టు పడుతున్న సంఘ పరివార్ శక్తుల కింద ఉన్న ప్రభుత్వం, అన్ని మతాలలో ఉన్న అసమానతలను ఉమ్మడి పౌర స్మృతి ద్వారా అయినా ఎలా రద్దు చేస్తుంది అనేది ఇంకో పెద్ద సందేహం. ఉమ్మడి పౌర స్మృతిలో 'ఏ ముస్లిం కూడా హిందూ స్త్రీని వివాహమాడకూడదూ' అని ఉండబోతుందా?

అసలు హిందూ సమాజంలో కులం పోకుండా ఉమ్మడి పౌరస్మృతి ఎలా అమలులోకి వస్తుంది అనేది ఒక ప్రశ్న. కులాంతరం చేసుకొంటున్న యువతీ యువకులను పరువు హత్యలు చేస్తున్న తరుణంలో ఈ ప్రశ్న సందర్భోచితమైనది. విలువైనదీ కూడా. ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి రావాలంటే హిందూమతంలో ఉన్న కులంలాంటి అవాంఛనీయ వ్యవస్థలు రద్దు కావాలి. హిందూ సమాజం అనుభవిస్తున్న అవిభక్త కుటుంబ పన్ను రాయితీలను అన్ని మతాలకు వర్తింపచేయాలి. క్రిస్టియన్స్‌కూ పార్శీలకూ వారసత్వచట్టం, 1925లో ఉన్న సమానత్వం, జండర్ న్యాయంలాంటి సదుపాయాలు అన్ని మతాలకు వర్తింపచేయాలి. హిందూ వివాహాలలో అమలు అవుతున్న సప్తపది, కన్యాదానం లాంటి పురుషాధిక్య మతక్రతువులను రద్దు చేసి ముస్లిం వివాహ పద్ధతుల్లోలాగా స్త్రీలను సురక్షిత స్థితిలో ఉంచే వివాహాలు రావాలి. కట్నం స్థానంలో 'మెహర్' రావాలి. ముస్లిం బహుభార్యత్వం లాగా కాకుండా, హిందూ బహుభార్యత్వంలో రెండో భార్యలకు ద్వితీయ స్థాయిని యిచ్చి వారి గౌరవాన్ని దిగజార్చే సాంఘిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకోవాలి. ముస్లిం బహుభార్యత్వం గురించి ఎక్కువగా మాట్లాడేవాళ్లు ఇటీవల సుప్రీం కోర్టు రెండో భార్యలకు కూడా గృహహింస చట్టం కింద ఉపశమనం యివ్వాలనీ, వారికీ భరణం యివ్వాలనీ యిచ్చిన తీర్పులను మర్చి పోకూడదు. అంటే బహుభార్యత్వం హిందూ పర్సనల్ లా ప్రకారం చట్టవిరుద్ధమైనా అది ఇక్కడ వేళ్లూనికొని ఉన్నదని కోర్టులు అంగీకరిస్తున్నట్లే.

ట్రిపుల్ తలాక్, బహు భార్యత్వానికి వ్యతిరేకంగా ఇప్పటికే ముస్లిం మహిళా సంఘాలు పోరాటాలు చేస్తున్నాయి. అక్కడితో ఆగకుండా వాళ్ళు తమకు ఆర్థిక, రాజకీయ హక్కులు కావాలని పోరాటాలు చేస్తున్నారు. ఆ పోరాటాలను పట్టించుకొని ముస్లిం పర్సనల్ లా ను ఆధునీకరించాలి. యూనిఫార్మ్ సివిల్ కోడ్‌ను ముస్లిమ్ మహిళలు కోరుకోవటం లేదు. ఎందుకంటే దానికి సంబంధించిన ప్రతిపాదనలు ముస్లిములను ద్వేషించే వర్గాల వైపు నుండి వస్తున్నాయి. సమకాలీన భారత పరిస్థితులు వారికి రక్షణనూ భద్రతనూ యివ్వలేక పోతున్నాయి. ఉమ్మడి పౌరస్మృతికీ, ముస్లిం మహిళల హక్కులకూ ముడి పెట్టి దేశ సమగ్రత పేరుతో తమ లక్ష్యం నెరవేర్చుకోవాలనే ఉద్దేశ్యాన్ని గమనించలేనంత అమాయకులు కాదు ముస్లిం మహిళలు.

జండర్ న్యాయమనేది ఈ చట్ట సంస్కరణల ఉద్దేశ్యమయితే ఈ బహుళ లైంగిక సంబంధాల పితృస్వామ్య వివాహాల కోరలు పీకేయాలి. అలా చేసినపుడే అన్ని సమూహాలలోనూ ఎక్కువమంది భార్యలను కలిగి ఉండే వాస్తవాన్ని గుర్తించినవారమౌతాము. అలాంటి సంబంధాలలో ఉన్న స్త్రీల హక్కులను కాపాడగలుగుతాము.

శ్రామిక

# రెడీమేడ్ దుస్తుల రాకతో చప్పడాగిపోతున్న కుట్టుమిషన్లు - ఉపాధికోల్పోతున్న మహిళ

బి.పద్మ



మానవజాతి అభివృద్ధి క్రమంలో ఆకులతో, జంతుచర్మంతో తన శరీరాన్ని కప్పుకున్న దశ నుండి బట్టకట్టుకునే దశ వరకు మనిషి ఎంతో ఎదిగాడు. ఇవాళ రకరకాల ఫ్యాషన్ డిజైన్‌లతో, రోజుకోరకంగా మనిషి వేషధారణ మారడం వెనుక దర్జీల శ్రమ ఎంతో వుంది. వ్యవసాయం నుండి చేతివృత్తులు వేరై ఒకరి అవసరాన్ని మరొకరు తీర్చుకునే దశ నుండి పెట్టుబడి రంగప్రవేశం తర్వాత మారకపు విలువలకు ప్రాధాన్యత పెరిగింది. పెట్టుబడి ఉపాధిని కల్పించే మాట ఎంత వాస్తవమో లాభాలే లక్ష్యంగా పెట్టుబడి పరిమాణం పెరిగే కొద్దీ చేతివృత్తులు చేసుకునే వారి ఉపాధిని దెబ్బతీస్తుందనేది కూడా అంతేవాస్తవం. 1990 దశకం తర్వాత రెడీమేడ్ దుస్తులు వచ్చి కుట్టుమిషన్‌లపై ఆధారపడి జీవించే వారి బ్రతుకుదెరువు ప్రశ్నార్థకంగా మారింది. కుట్టుమిషన్ వృత్తిలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం తర్వాత దర్జీల కుటుంబాలే కాదు, టైలరింగ్‌షాపులు కూడా మూతపడిపోతున్నాయి. వారు యితర వృత్తుల్లోకి వెళుతున్నారు. కుట్టుమిషన్‌లపై ఆధారపడి జీవించే మహిళల స్థితిగతుల గురించి కూడా తెలుసుకోవడానికి టైలర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు బి.శ్రీనివాసులు అన్నని కలిసినపుడు ముందుగా పెట్టుబడి క్రూరత్వాన్ని గురించి, కార్మికుల మధ్య పోటీతత్వం గురించి, కార్మికుల శ్రమదోపిడీ గురించి, మహిళల స్థితిగతుల గురించి అనేక విషయాలు తన జీవితానుభవం నుంచి వివరించారు.

18వ శతాబ్దం మధ్యలో ఇంగ్లండులో వచ్చిన పారిశ్రామిక విప్లవం బట్టల ఉత్పత్తిలో ఊహించని అభివృద్ధిని సాధించింది. పెట్టుబడిదారీవర్గం తన లాభాల కోసం, మార్కెట్ల కోసం శాస్త్రజ్ఞులను ప్రోత్సహించారు. దీనికి అనుగుణంగా అనేక నూతన ఆవిష్కరణలు జరిగాయి. దానిలో భాగంగా కుట్టుమిషన్‌ని కూడా కనిపెట్టారు. థామస్ సెయింట్ కుట్టుమిషన్‌ను కనిపెట్టినా అమెరికాకు చెందిన విలియం 'హెూ ' కుట్టుమిషన్‌ను చేతితో తిప్పే మిషన్ టెక్నాలజీని అభివృద్ధిచేసి స్టాండ్‌ను ఏర్పాటు చేసి ప్రస్తుతం మనం కుట్టేమిషన్ తయారుచేశారు. తర్వాత సింగర్ ఇంగ్లాండ్ నుండి వచ్చి సింగర్ మిషన్‌ను విడుదల చేశారు. కలకత్తాలో 1920లో ఈస్టు ఇండియా కంపెనీకి చెందిన ఉషా కంపెనీ కుట్టుమిషన్‌ను విడుదల చేసింది. తర్వాత జర్మనీ హైస్పీడ్ కటింగ్‌మిషన్‌లు, ఖాజా మిషన్లు, బటన్ మిషన్‌లు తయారు చేశారు. నేటి కంప్యూటర్ యుగంలో యువతీ యువకులు వేసుకునే బట్టల వ్యాపారం కోట్ల లాభాలకు చేరింది. 1905కి ముందు మన భారతదేశంలో ఐరన్‌సూది, లావుదారంతో బట్టలు కుట్టేవారు. క్రమేపీ చిన్నసూది, సన్నని దారంతో బట్టలను అందంగా కుట్టడం ప్రాచుర్యంలోకి వచ్చింది. నేడు బహుళజాతి సంస్థలు రంగప్రవేశం చేసిన తర్వాత బట్టల్ని రకరకాల ఆకారాల్లో కత్తిరించే మిషన్‌లు, బట్టలు కుట్టేమిషన్ రకరకాల డిజైన్‌లతో, మోడల్స్‌తో వచ్చాయి. ఫ్యాషన్‌డిజైన్‌ను ఇవాళ చదువుకునే కోర్సుల్లోకి చేర్చారంటే దాని ప్రాధాన్యత ఎంతో వుంది. గతంలో నిరక్షరాస్యులే తమ అనుభవంతో బట్టను కత్తిరించే టెక్నాలజిస్టులుగా, మాస్టర్ డిగ్రీ చదివిన వారిలాగా కొలతలు తీసుకొని బట్టలు కుట్టి యిచ్చేవారు. మిషన్‌లో ఏదైనా పార్టు పోయినా వాటిని బాగుచేసే టెక్నీషియన్లుగా దర్జీలే చేసుకునేవారు. దర్జీ వృత్తి నేర్చుకోవడానికి చాలా కాలం అనుభవం కలిగిన వారిదగ్గర పనిచేసేవారు.

## దర్జా కోల్పోతున్న దర్జీ బ్రతుకులు

ఇవాళ భారతదేశంలో ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బట్టలు కుట్టే వృత్తిలో అనేక మంది జీవనం సాగిస్తున్నారు. ఇంటి దగ్గరే బట్టలు కుట్టేవాళ్ళూ, ఒక యజమాని దగ్గర 10-20 మంది కూలీకి కుట్టేవాళ్ళూ, పీస్‌రేటుకి ఫ్యాంట్లు, షర్టులు కుట్టేవాళ్ళూ, మగ్గం వర్క్ చేసేవాళ్ళూ, దిండుకవర్లు, నైటీలు, లంగాలు కుట్టేవాళ్ళూ, స్కూలుపిల్లలకు యూనిఫాం కుట్టేవాళ్ళూ, గార్మెంట్సుల్లో పనిచేసేవాళ్ళూ....ఇలా రకరకాలుగా పనిచేసేవారిలో కొంత మందిని కలిసి వారి కష్టసుఖాలు తెలుసుకోవడం జరిగింది. కావలిలోని కందుకూరిఫ్యాషన్స్ గార్మెంట్స్ వారిని కలవడం జరిగింది. ఈ వృత్తిలోకి గతంతో పోల్చుకుంటే మహిళల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

"ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టైలరింగ్ వృత్తిమీద ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా 40లక్షల మంది జీవనోపాధిసాగిస్తున్నారని" ఒంగోలుకి చెందిన టైలర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి కానుగల నాగేశ్వరరావు చెప్పారు. నేడు క్రమంగా ఆ సంఖ్య తగ్గిపోతుందని ఆవేదన చెందారు. బహుళజాతి సంస్థలు వచ్చిన తర్వాత, రెడీమేడ్ బట్టలు మార్కెట్‌లో ముంచెత్తిన తర్వాత మూడు నెలలకంటే ఎక్కువ పనులు వుండటం లేదని నెల్లూరుకి

చెందిన టైలర్స్‌యూనియన్ నాయకులు ఎస్‌కె.ఖాదర్‌భాషా చెప్పారు. పెండ్లి, పండుగలు లాంటి శుభకార్యాల సందర్భం తప్ప మిగిలిన రోజుల్లో పనులు లేక చాలా మిషన్లను, కార్మికులను తగ్గించుకున్నట్టు మరో టైలర్ యూనియన్ నాయకులు బాలాజీ శ్రీనయ్య చెప్పారు. దీనితో యజమానులు దెబ్బతినడమే కాకుండా కూలీలకు కూడా ఉపాధి తగ్గిపోయింది. స్థానికంగా రెడీమేడ్ బట్టలు తయారు చేసే గార్మెంట్స్ కంపెనీల్లో కూలీ లెక్కగడితే కార్మికునికి పీస్‌కి 10నుండి 12రూపాయల కంటే ఎక్కువ పడటంలేదు. మూతపడిన పరిశ్రమల నుండి అతి తక్కువ ధరకు టన్నుల కొద్దీ బట్ట కొనుగోలు చేసి యంత్రాలతో కట్ చేయించి షర్టును 120 రూపాయలకు, ఫ్యాంటును 220 రూపాయలకు తయారు చేసి రెడీమేడ్ షాపుల్లో పెడుతున్నారు. " మా విషయానికి వస్తే మెటీరియల్, కార్మికులకు కూలీ, షాపు అద్దెలు, కరెంటు చార్జీలు, ఐరన్ చేయించడం తదితర ఖర్చులతో 200కి పైగా పడుతున్నందున మేము ఒక ఫ్యాంటుకి, షర్టుకి 500 నుండి 600 రూ॥లు తీసుకోవాల్సి వస్తుంది. మా కుట్టుకూలీ కన్నా తక్కువరేటుకి రెడీమేడ్‌షాపుల్లో షర్టులు, ఫ్యాంటులు దొరుకుతున్నపుడు మా దగ్గర కుట్టించడం కస్టమర్ తగ్గిస్తాడు. కస్టమర్లు తగ్గేకొద్దీ గిట్టుబాటుకాక కార్మికులను తగ్గించాల్సి వస్తుంది. ఇంగ్లండు వారి బట్టల పోటీకి తట్టుకోలేక ఇండియాలో చేనేత పరిశ్రమ దెబ్బతిన్నట్టు మా వృత్తి కూడా రెడీమేడ్ బట్టలతో పోటీపడలేక దెబ్బతింటుందని" రిట్జ్ టైలర్ శ్రీనన్న చెప్పారు. స్థానికంగా గార్మెంట్స్ కంపెనీల్లో ఉత్పత్తి అయ్యే దుస్తులు కాకుండా రేమాండ్స్, పీటర్ ఇన్‌లాండ్ తదితర కంపెనీల పోటీలతో, పెద్దపెద్ద ప్రచార హోర్డింగులతో యువతను వారు ఆకర్షించగలుగుతున్నారు. ఎంతో నాణ్యంగా, కష్టమర్‌కి తగిన కొలతలతో అందంగా కుట్టినా సైజుల ప్రకారం కొనుక్కొని రెడీమేడీ షాపుల్లో బట్టలు ధరిస్తున్నారు. వారికి తాత్కాలిక అవసరాలు తీరిపోతున్నాయి. మెటీరియల్ ఖర్చులు, యంత్రాల అరుగుదల, నిర్వహణాఖర్చులు మొత్తం పోను 100 నుండి 200 వరకు టైలర్స్ యజమానులకు మిగులుతుంది. ఇపుడు మూడునెలలు మాత్రమే పని వున్నందున మిగిలినరోజులకు కార్మికుల శ్రమ నుంచి మిగుల్చుకున్నదే మేము చెల్లించాల్సివస్తుంది. షాపులు నిర్వహించలేక అనేకమంది యితర వృత్తుల్లోకి వెళ్ళుతున్నారు.

## శ్రమదోపిడీకి గురవుతున్న కార్మికులు

ఒక యజమాని దగ్గర పనిచేసే కూలీ అయినా, గార్మెంట్స్‌లో పనిచేసే మహిళా కూలీ అయినా శ్రమదోపిడీకి గురవుతున్నారు. శ్రమదోపిడీతోనే పెట్టుబడి పోగుపడుతోంది. శ్రమదోపిడీపై ఆధారపడి శ్రమచేయని వర్గాలు బ్రతుకుతాయనేదానిలో ఎలాంటి సందేహంలేదు. ఒక టైలర్‌షాపు యజమాని దగ్గర 10 మంది కూలీలు పనిచేస్తున్నారు. వారికి ఎటువంటి సొంత ఆస్తులులేవు. రెక్కల కష్టమే ఆధారం. కొంతమందికి ప్రభుత్వం యిచ్చిన ఇళ్ళు వున్నాయి. వారు ప్రతిరోజు ఉదయం 10గం॥లకు షాపుకు వచ్చి రాత్రి 9గం॥ల వరకు పనిచేస్తున్నారు. వారు ఎటువంటి సమయం వృధా చేయకుండా రోజంతా పనిచేస్తే 5చొక్కాలుగానీ 5ప్యాంట్లుగానీ



కుదతారు లేదా మూడు జతలు (షర్టు, ప్యాంటు కలిపి జత)కుట్టుతారు. ఒక టైలర్ రోజుకి మూడు జతలు కుడితే 1500రూ॥లు యజమానికి వస్తాయి. యజమాని దీనిలో నుండి మెటీరియల్, ఇతరాలు, కూలీ కలిపి మూడు జతలకు 1200 ఖర్చుపెడతాడు. మూడు జతలకు యజమానికి 300 రూ॥లు మిగులుతున్నాయి. 10 మంది కూలీల మీద మూడు వేలు మిగులుతున్నాయి. యజమాని మాత్రం టైలర్‌కి ఒక జతకు 120 రూ॥లు మూడు జతలకు 360 రూ॥లు కూలీ యిస్తాడు. ఇక్కడ కార్మికుల శ్రమదోపిడీ జరుగుతున్నది. రోజంతా పనిచేసినా నెలకు సరాసరిన 9వేలు రూ॥ ఒక టైలర్ సంపాదిస్తున్నాడు. దానిమీద కుటుంబం మొత్తం ఆధారపడాల్సి వుంటుంది.

## టైలర్ వృత్తిలోకి పెరుగుతున్న మహిళలు

టైలర్‌వృత్తిలో గతంలో పురుషులు ఎక్కువగా వున్నారు. నేడు ఈ వృత్తిలో స్త్రీల సంఖ్య క్రమంగా పెరుగుతతోంది. వీరిలో ఇళ్ళల్లో వుండి మిషన్‌కుట్టడం, టైలర్స్‌షాపుల్లో పనిచేయడం, గార్మెంట్స్ పరిశ్రమల్లో పనిచేయడం ప్రధానంగా చేస్తున్నారు. మహిళలు టైలర్ వృత్తితో పాటు ముఖ్యంగా చేతిపనులు హుక్కులు వేయడం, ఫాల్స్‌కుట్టడం, ఫ్యాబ్ వర్క్, జిగ్‌జాగ్, కాజాలు, బటన్స్ వేయడం తదితర పనులన్నీ రోజువారీ కూలీ కింద పనిచేస్తున్నారు. వీరు రోజు ఉదయం 10 గం॥ల నుండి 8 గం॥ల వరకు పనిచేస్తున్నారు. వీరికి రోజంతా పనిచేస్తే 200 నుండి 250 వరకు కూలీ యిస్తున్నారు. నెలలో ఈ పని 10రోజులు కూడా వుండటంలేదు.

గార్మెంట్స్ కంపెనీలో మహిళలు రెడీమేడ్ దుస్తులు కుట్టడానికి నెలకు 2500 నుండి 3000 వరకు జీతం యిస్తున్నారు. గార్మెంట్స్ పరిశ్రమలు స్థాపించడానికి యజమానులు ప్రభుత్వం దగ్గర రాయితీలు పొందుతున్నారు. పెట్టుబడి పెట్టి ఉత్పత్తులు తీస్తున్నారు. ఒక్కో గార్మెంట్ కంపెనీలో దాదాపు 200 మందికి పైగా మహిళలు పనిచేస్తున్నారు. పెద్ద పెద్ద యంత్రాలు కొనుగోలు చేసి బట్టలు వివిధ డిజైన్స్‌లో కట్‌చేసి కాలర్స్, చేతులు, చొక్కాబాడీలు...ఇలా పార్టులు పార్టులుగా చేసి మహిళలకు అందిస్తారు. వీరు పనిచేసినంతసేపు తల ఎటూతిప్పకుండా మిషన్‌ల వైపే తదేకంగా దృష్టిపెట్టి పనిచేయాల్సి వుంటుంది. వీరందరితో పనిచేయించడానికి గతంలో మేస్త్రీలను పెట్టేవారు. నేడు సి.సి.కెమేరాల ద్వారా చూస్తున్నారు.



యజమాని చూసి సంతృప్తి చెందకపోతే ఉద్యోగం నుండి తొలగించే అవకాశం వుంటుంది. టెక్నాలజీ మనిషి శ్రమకి తోడ్పాటునివ్వడం కాకుండా వారి హక్కుల్ని హరిస్తుందని టైలర్స్‌కాలనీకి చెందిన మహిళాటైలర్ జుబేదా చెప్పింది. గ్రామాల్లో పని చేసేటపుడు శ్రమ మరిచిపోవడానికి ముచ్చట్లు, పాటలతో సమయమే తెలియకుండా పోయేది. నేడు యంత్రాలతో పోటీపడి శ్రమ చేయాల్సి వస్తుందని శ్రమ తీవ్రత ఎక్కువగా వుంటుందని ఆవేదన చెందింది. తక్కువ కూలీతో ఎక్కువ శ్రమ చేయించుకుంటున్నారనే విషయం వారికి కూడా అర్థమైపోతుంది.

పీస్‌వేజ్‌లో కూడా పెట్టుబడిదారుడికి అజమాయిషీ ఖర్చులు తగ్గుతాయి. నాణ్యత విషయం కూడా కార్మికులే చూసుకోవాల్సి వుంటుంది. పద్ధతి ఏదైనా కార్మికుల శ్రమ దోపిడీ చేయబడుతుంది. గార్మెంట్స్ కంపెనీల్లో నైపుణ్యం కలిగిన ఒకరిద్దరు మహిళల్ని ఉంచుకొని నైపుణ్యంలేని మహిళా కార్మికులను ఎక్కువ మందిని నియమించుకుంటున్నారు. సూపర్‌వైజ్ చేసే ఆడవాళ్ళు మంచి బట్టలు వేసుకురావాలని, నీట్‌గా వుండాలని సతాయిస్తున్నారు. యూనియన్ నాయకులు చెప్పిన వివరాల ప్రకారం షామీర్‌పేటలో వున్న గార్మెంట్స్ పరిశ్రమలో 250 మంది మహిళలు, కావలి కందుకూరి ఫ్యాషన్స్‌లో 150 మంది మహిళలు పనిచేస్తున్నారు. అనంతపురం రాయదుర్గంలో వుండే రెడీమేడ్ గార్మెంట్స్ బొంబాయి లాంటిదని ప్రతి సంవత్సరం 350 కోట్లు టర్నోవర్ జరుగుతుందని దాదాపు 35వేల మంది మహిళలు, కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. ఇవి కాక వెలుగు ప్రాజెక్టుల క్రింద స్వయం ఉపాధి క్రింద గార్మెంట్సు తయారు చేస్తున్నారు. వీటిల్లో మహిళలు కత్తిరించడం, కుట్టడం, ఖాజాలు, ఇస్త్రీలు, ప్యాకింగ్ తదితర పనులు చేస్తున్నారు. తక్కువ వేతనాలు, ఎక్కువ పనిగంటలు పనిచేయించుకుంటున్నారని కావలిలో పనిచేసే మహిళ చెప్పింది. సరిగా వర్షాలు రాక, పొలం పనులు లేక చుట్టుప్రక్కల గ్రామాల నుండి నడిచివచ్చి గ్రామీణ మహిళలు కూడా ఈ గార్మెంట్స్ కంపెనీల్లో పనిచేస్తున్నారు.

నెల్లూరు పొదలకూరురోడ్‌లోని ఒక పెద్ద గోడౌన్‌లో లంగాలు కుట్టే పరిశ్రమకు వెళ్ళి వివరాలు సేకరించడం జరిగింది. ఇందులో పనిచేసే వారంతా మహిళలే. దాదాపు 50 మంది వుంటారు. వీరంతా 35-40 సంవత్సరాల వయస్సువారే. వీరు కాక కొంతమంది మహిళలు మెటీరియల్ ఇంటికి తీసుకెళ్ళి కుట్టి తెచ్చి యిస్తున్నారు. యజమాని మిషన్‌పై బల్క్‌గా కట్‌చేసిన ముక్కలను మహిళలకు యిస్తారు. ఒక్క లంగా కుట్టినందుకు మహిళకు మూడు రూపాయలు యిస్తారు. ఒక్కో మహిళ రోజుకి 40 లంగాలకన్నా ఎక్కువ కుట్టలేదని శాంతి అనే మహిళా కార్మికురాలు చెప్పింది. అంటే రోజుకి 120 రూ॥లు మాత్రమే సంపాదిస్తారు. లంగాకి రెండు మీటర్లు బట్ట అవసరం అవుతుంది. దాని ఖరీదు 75 రూ॥లు పడుతుంది. కూలీ 3రూ॥లు, కరెంట్, ట్రాన్స్‌పోర్టు, 2రూ॥లు వెరసి ఒక్కో లంగా 75 రూ॥లు పడుతుంది. అతను మార్జిన్ చూసుకొని హోల్‌సేల్ షాపులకు యిస్తే వాళ్ళు కస్టమర్‌కి 100 రూ॥లకు అమ్ముతున్నారు. నైటీలు, దిండు కవర్లు తయారు చేసే పరిశ్రమ దగ్గర కూడా యిదే పద్ధతి కొనసాగుతుంది. నైటీకి 12 రూ॥లు, దిండు కవర్‌కి 2రూ॥లు ఒక్కో మహిళా కార్మికురాలికి యిస్తున్నారు. యజమానులు లాభాలు పోగేస్తుంటే మహిళా కార్మికులు మాత్రం శ్రమ దోపిడీకి గురవుతూ పెరిగే ధరలకు పోటీ పడలేక కుటుంబాల్ని పోషించలేక అనేక యిబ్బందులు పడుతున్నారు.

## మగ్గం వర్క్‌లోనూ శ్రమదోపిడీనే

మగ్గం వర్క్ చేసే వారి దగ్గరకు వెళ్ళి పరిశీలన చేస్తే .... చీరలు, జాకెట్లుకి మగ్గం వర్క్‌చేసే వారంతా ఉత్తర ప్రదేశ్‌కి చెందిన యువకులు. దీనిలో శ్రమ చాలా ఎక్కువగా వుంటుంది. ఉదయం నుండి సాయంత్రం వరకు అదేపనిగా చేస్తే వారికిచ్చే కూలీ 500 రూ॥లు మాత్రమే. దీనికి ప్రత్యేకదృష్టిపెట్టి నైపుణ్యంతో పని చేయాల్సి వుంటుంది. పని ఆర్డర్లు తీసుకోవడం, డెలివరీ చేయడం తదితర పనులకు మాత్రమే మహిళలను నియమించుకున్నారు. కష్టమర్లు దగ్గర పనిని బట్టి ఒక జాకెట్‌కి 3వేలు నుండి 10వేల వరకు తీసుకుంటారు. మహిళలకు రోజుకి 200 రూ॥లు కూలీ యిస్తారు. వారానికి ఆరురోజులు పని వుంటుంది. లక్ష్మి అనే మహిళతో చర్చించినపుడు తన భర్త కూడా టైర్లు పంచర్లు వేసి రోజుకి 300 రూ॥లు కూలీ తెస్తాడని, ఇద్దరిమీద నెలకు 12వేలు సంపాది స్తున్నామని, తమ సంపాదన కుటుంబపోషణకు సరిపోవడంలేదని చెప్పింది. వివరాలు అడిగితే పిల్లలకు ఇద్దరికి కలిపి 55వేలు ఫీజు చెల్లిస్తున్నామని, వారి ట్యూషన్‌ఫీజు 500, ఇంటి అద్దె 4000, సరుకులు 3500, పాలు 1500 రూ॥లు కరెంట్‌ఫీజు, డిష్‌బిల్లు కలిపి చాలక అప్పులు చేస్తున్నట్టు చెప్పింది. ప్రస్తుతం రెండు లక్షలు అప్పు వుందని నాలుగువేలు వడ్డీ కడుతున్నామని చెప్పింది. అప్పైనా సప్పైనా పిల్లల్ని చదివించి కష్టాలు గట్టెక్కాలనే ఆశను ఆమె వెలిబుచ్చింది.

### స్కూలు యూనిఫాంలోనూ లబ్ధి యజమానులది, చాకిరీ మహిళలది

స్కూలు విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ ద్వారా బట్టలు కుట్టించి యివ్వాలని ప్రభుత్వం నిర్ణయిం తీసుకున్న తర్వాత రాష్ట్రంలో అనేక కుట్టుమిషన్ కేంద్రాలు వెలిశాయి. దీనిలో దాదాపు మహిళలే అత్యధికంగా పనిచేస్తున్నారు. పెట్టుబడి పెట్టి మిషన్లుకొని, పెద్దహాలు అద్దెకు తీసుకొని, 10-15 మంది కూలీలను

నియమించుకొని పిల్లలకు బట్టలు కుట్టి యిచ్చేవారు కొంతమంది అయితే, నైపుణ్యం కలిగిన కట్టర్‌ని నియమించుకొని బట్టలను ఇళ్ళకు పంపిణీ చేయడం అక్కడ మహిళలు కుట్టి యజమానికి అప్పజెప్పడం చేస్తున్నారు. ఏ పద్ధతిలోనైనా పనిచేస్తున్న వారంతా మహిళలే. గతంలో ప్రభుత్వం బట్టను నేరుగా ఎం.ఇ.ఓ.లద్వారా స్కూళ్ళకు పంపేది. ఆ బట్టను తీసుకొని ప్రధానోపాధ్యాయులు స్థానికంగా గ్రామాల్లో వుండే టైలర్స్‌కి, పొదుపు సంఘాలకు యిచ్చి కుట్టించేవారు. ఎం.ఇ.ఓ.లు కుట్టుమిషన్ కేంద్రాల యజమానులు కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణలు రావడంతో గుడ్డను ఆప్కోకి అప్పగించారు. రాజకీయనాయకుల జోక్యం పెరగడంతో ప్రస్తుతం బట్టతో పాటు కుట్టే బాధ్యత కూడాకు ఆప్కోకి అప్పగించారు. నిర్వాహకులకు ప్రభుత్వం ఒక యూనిఫాంకి 40రూ॥లు యిస్తుంది. నిర్వాహకులు నిక్కరకు 6 రూ॥లు, చొక్కాకి 5రూ॥లు, పెద్దచొక్కాకి (8,9,10 తరగతులకు) 6రూ॥, ఫ్యాంటుకి 8రూ॥లు, మిడ్డీకి 6 రూ॥ పంజాబీకి 6 రూ॥లు, పంజాబీ ఫ్యాంటుకి 5రూ॥లు యిస్తున్నారు. టైలర్స్‌కి 11 రూ॥లు, మెటీరియల్‌ఖర్చు, యంత్రాల అరుగుదల, అద్దెలు పోను యజమానులకు మిగిలేది మహిళల శ్రమే.

## పెద్ద చేప చిన్నదాన్ని మింగేసే న్యాయం

గార్మెంట్స్ యజమానులతో మాట్లాడినపుడు "మాది కోటి, రెండు కోట్ల రూ॥ల పెట్టుబడి మాత్రమే. బెంగుళూరులో లక్ష యాభైవేల మంది కార్మికులతో వున్న గోగుల్‌దాస్‌కంపెనీ, బొంబాయి, ఢిల్లీలో ఇతర కంపెనీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టి సంపాదించే వారున్నారని" ప్రభాకర్ అనే యజమాని అన్నారు. "ఇవి కాక, రేమాండ్స్, పీటర్ ఇంగ్లాండ్, లెవీస్ తదితర బహుళజాతి సంస్థలు దేశవ్యాపితంగా 400-500 షాపులు పెట్టి 1000నుండి 1500 కోట్లు టర్నోవర్ చేయగలుగుతున్నారు. ఇవికాక ఇతర దేశాల నుండి దుస్తులు దిగుమతి అవుతున్నాయి. రాబోయే రోజుల్లో మేము కూడా మీ బాటలోనే నడవాల్సి వస్తుందని" ఛలోక్తిగా మాట్లాడారు. టైలర్స్ వృత్తిని నమ్ముకొని వేలాది మంది పురుషులు, మహిళలు జీవిస్తున్నారు. రెడీమేడ్ దుస్తులు వచ్చి టైలర్స్‌షాపుల యజమానుల మార్కెట్‌ని ఆక్రమించాయి. బహుళజాతి సంస్థలు వచ్చి చిన్న పరిశ్రమల మార్కెట్‌ని ఆక్రమించాయి. ఫలితంగా శ్రామికులకు ఉపాధిపోతుంది. ఉపాధి పొందినా శ్రమ తీవ్రత ఎక్కువగా వుంటుంది. అందుకే చాలా మంది టైలర్ వృత్తిని వదిలి పండ్లు, కూరగాయలు అమ్ముకునే వృత్తిలోకి, ఆటోలు నడిపే వృత్తిలోకి వెళ్ళుతున్నారు.

## దోపిడీకి, అనారోగ్యానికి గురవుతున్న టైలర్ కార్మికులు

మొత్తంగా అన్ని రంగాలలో పనిచేసే టైలర్ కార్మికులకు కంటి జబ్బులు, చెవి వ్యాధులు, శ్వాసకోశ సంబంధవ్యాధులు, మెడ, నడుము, వెన్ను నొప్పులు తదితర జబ్బులు వస్తున్నాయి. ప్రభుత్వం యిచ్చే ఆరోగ్యశ్రీలో కూడా ప్రయోజనం పొందే జబ్బుల సంఖ్య 250కి కుదించినందున పేదలు ప్రభుత్వం నుండి లబ్ధి పొందలేకపోతున్నారు. ప్రభుత్వం విద్య, వైద్యం ప్రైవేటుపరం చేసిన తర్వాత తమ సంపాదనలో అత్యధికం వాటికే పోతుంది. పెన్షన్‌లు, ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యాలు కూడా లేవు. ప్రభుత్వ గుర్తింపుకార్డులు లేవు. పిఎఫ్ సౌకర్యం వున్న బెంగుళూరు గార్మెంట్సులో ప్రభుత్వం తీసుకున్న పాలసీవలన ఇటీవల పెద్దఎత్తున మహిళా కార్మికులు ఉద్యమించారు. తమిళనాడు, కేరళలో మహిళా టైలర్స్‌కి పెళ్ళికాని వారికి పెళ్ళి కానుకగా 25వేలు యిస్తున్నారు. మహిళా టైలర్లు ఏడు నెలల గర్భవతి వరకు పనిచేస్తారు. ఆ తర్వాత ప్రసవం అయిన మూడు నెలల వరకు అక్కడి ప్రభుత్వం నెలకు మూడువేలు భృతి యిస్తున్నారు. గుర్తింపుకార్డులు యిచ్చి వృద్ధులకు మూడువేలు పెన్షన్ యిస్తున్నారు. తమిళనాడు, కేరళలో మాదిరిగా మన రాష్ట్రాల్లో కూడా మహిళలకు సౌకర్యాలు కల్పించాలని మహిళా టైలర్స్ కోరుతున్నారు.

**టైలర్ వృత్తిలో ఉపాధి పెరగాలంటే ప్రభుత్వం టైలర్‌షాపులకు విద్యుత్ సబ్సిడీ యివ్వాలి. వృద్ధులైన కార్మికులకు ప్రభుత్వ గుర్తింపుకార్డులు యిచ్చి పెన్షన్ యివ్వాలి. ఇ.ఎస్.ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలి. పక్కా గృహాలు నిర్మించి యివ్వాలి. యాజమాన్యాలు కూడా సంవత్సరానికి పండుగల సందర్భంలో కార్మికులకు బోనస్‌లు యివ్వాలి. టైలర్స్ అందరికి ఇన్సూరెన్స్ పథకంలో చేర్పించి వారికి వైద్యం చేయించాలి. టైలర్స్ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి.**

## ఉద్యమాలే ఆలంబన కావాలి

రాష్ట్రంలో 450 టైలర్స్ సొసైటీలు రిజిష్టర్ అయివున్నాయి. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఫెడరేషన్ ఏర్పాటుకు యిచ్చిన జి.ఓ.86ని రద్దుచేసింది. ఈ ఫెడరేషన్‌లకు కేటాయించిన డబ్బును కూడా ఖర్చుచేయలేదు. టైలర్‌షాపు యజమానులకు ప్రభుత్వం పావలా వడ్డీకి రుణాలు యిచ్చి ప్రోత్సహించాలి. టైలర్ వృత్తిలో ఉపాధి పెరగాలంటే ప్రభుత్వం టైలర్‌షాపులకు విద్యుత్ సబ్సిడీ యివ్వాలి. వృద్ధులైన కార్మికులకు ప్రభుత్వ గుర్తింపుకార్డులు యిచ్చి పెన్షన్ యివ్వాలి. ఇ.ఎస్.ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలి. పక్కా గృహాలు నిర్మించి యివ్వాలి. యాజమాన్యాలు కూడా సంవత్సరానికి పండుగల సందర్భంలో కార్మికులకు బోనస్‌లు యివ్వాలి. టైలర్స్ అందరికి ఇన్సూరెన్స్ పథకంలో చేర్పించి వారికి వైద్యం చేయించాలి. టైలర్స్ పిల్లలకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి. ఈ వృత్తిని నేడు అత్యధికం బి.సి.లు చేస్తున్నారు. ప్రభుత్వం రెడీమేడ్ షాపులకు ప్రాధాన్యత యిచ్చి పార్క్‌లకు స్థలాలు కేటాయించి చిన్న చిన్న షాపు యజమానులను నిర్లక్ష్యం చేస్తున్నారు. తమ కోసం, తమ బిడ్డల భవిష్యత్‌కోసం కార్మికులు సంఘటిత పడాలి. సంక్షేమ పథకాలకోసం ప్రభుత్వంపైనా, అధికవేతనాలకోసం యాజమాన్యాల మీద పోరాడి సాధించుకోవాలి. ❀

కతలు వెతలు

# చోటు

బమ్మిడి జగదీశ్వరరావు




ఆడవాళ్ళ సీట్లో కూర్చుంటే చాలు.. ఆవలింతలు తియ్యకుండా వీళ్ళకు నిద్ర ముంచుకొచ్చేస్తుంది.. అన్నాను. బస్సులో వున్నవాళ్ళకి వినపడేలానే అన్నాను. అందరిలా నోరు మూసుకోకుండా వున్నాను. అందుకే నా మాటలు నాన్నకు నచ్చలేదు. చిరాకుగా కోపంగా నావైపు చూసారు.

పోన్లే అక్కా.. చాలా యేళ్ళుగా నిద్రలేనట్టుంది.. చూడు యెలా సోలిపోయాడో.. అతన్ని చూస్తూ గుసగుసగా అంది మా చెల్లి.

తలగడా పరుపూ తెచ్చుకోవాల్సింది.. నామాటలకు చెల్లి నవ్వింది. నాన్న చూపు చూసి నవ్వుని చెరిపేసి బుద్దిగా మూగగా తలను పక్కకు తిప్పుకుంది.

నిద్రపోయిన వాళ్ళని లేపొచ్చు, నిద్ర నటించిన వాళ్ళని లేపలేం.. అన్నాను. నాన్న నావంకా నేనిలా తయారవుతున్నందుకు మా అమ్మవంకా కోపంగా చూసారు. అదేంటో సినిమాల్లో కూడా యింతే, పిల్లలు వేరే తోవలో వెళ్తే చాలు.. వెంటనే ఫట్‌మని అమ్మ బుగ్గ సిలండరు పేలినట్టు పేలిపోతుంది?!

అందుకేనేమో మా అమ్మ అంతా తెలిసీ తనకేం తెలీనట్టు బస్సు ముందుకు వెళ్తుంటే వెనక్కి చూస్తోందెటో.

కండక్టరుకు చెప్పాను. ముందు స్టేజీల్లో ఖాళీ అవుతుంది.. అన్నాడు. ఎక్కడ ఖాళీ అవుతుందో మిమ్మల్ని అడగలేదే?.. అన్నాను. హర్టయినట్టున్నాడు. అందుకే అడక్కుండానే- సీట్లు ఖాళీ చేయించి యివ్వడం మాపని కాదన్నాడు. ఖాళీ చేయిస్తూ మీకు యిస్తూ వుంటే యింక మేం డ్యూటీలు చెయ్యక్కర్లేదన్నాడు. వంతగా- అయినా వయసులో వున్న పిల్లలు ఆమాత్రం నిలబడలేరా?.. అని వొకరు- ఆడామగా సమానం అంటారు.. మరి యిక్కడెందుకో రిజర్వేషన్లు?!.. అని మరొకరు- కాసేపు వుండి దిగిపోయే దానికి గొడవలెందుకు?.. అని మరొకరు- జీవితం నీటి బుడగ.. మనం ప్రతీదీ పర్మినెంటు అనుకుంటాం.. అని యింకొకరు- కూర్చొని గీతోపదేశం చేసేస్తున్నారు. సిలబస్ రెడీ అన్నట్టు లెసెన్లు చెప్పేస్తున్నారు. ఆగి- మీరు లేచి మీ సీటు యిస్తారా?.. అని నేను అనేసరికి అంతా చెవిటి వాళ్ళయిపోయారు.

ఎక్స్‌క్యూజ్మీ.. అన్నాను. హలో.. మిమ్మల్నే.. అన్నాను. లేడీస్ సీట్.. లేవండి.. అన్నాను. మీకే చెప్పేది.. అన్నాను. అంటూనే వున్నాను. నాన్న కళ్ళతోనే నన్ను కట్టడి చెయ్యాలని చూస్తున్నారు. వద్దని వదిలెయ్యమని వారిస్తున్నారు. నా ప్రయత్నం నేను ఆపలేదు. వాడూ లేవలేదు.

కుంభకర్ణుడు.. యేనుగులు తెచ్చి తొక్కించినా- బాబా సెహగల్‌ని తెచ్చి డ్రమ్స్ వాయించినా- నో డౌట్, లేవడు.. చెల్లి గుసగుసగా అని కిసుక్కున నవ్వి, కసుక్కున నాన్న చూపు కాల్చేయకుండా బుద్దిగా నోటి మీద వేలు వేసుకు అలాగే నిలబడింది.

నిద్రలోంచి లేచినట్టు.. లేచి మళ్ళీ నిద్రలోకి జారినట్టు జారుతూ జోగుతూ ఆడవాళ్ళ సీట్లో అతను.. సారీ.. వాడు..

లేపబోతే- బుద్దుందా.. అని నాన్న. లేదన్నాను. నోర్మూసుకో.. అన్నారు. కోను.. అన్నాను. కోపంతో- లే లే.. అని కదిపి కుదిపి వాడ్ని లేపేసాను. కోమా లోంచి బయటకు వొచ్చినట్టు వొచ్చి కళ్ళుతెరిచి కంగారుగా- యిప్పుడు నేను యెక్కడున్నాను?.. అన్నట్టు చూసి, అంతలోనే చక్కగా దర్జాగా నిద్ర మాత్రలు మింగినట్టు కళ్ళు మూసుకొన్నాడు.

నీకే వినపడుతోందా?.. నాన్న నన్ను అంటే- నీకే వినపడుతోందా?.. నేను వాడ్ని అన్నాను.

ఇంకా వాడు నటించలేకపోయాడు. కళ్ళు తెరిచాడు. నన్ను కిందనుండి పై వరకు వో సారి చూసాడు. కాళ్ళూపుతూ కిటికీలోంచి చూస్తున్నాడు. చూసిందీ చేసిందీ చాల్లే లే.. అన్నాను. వాడు విన్నాడు. విని కూడా విననట్టే వున్నాడు. ఆర్ యూ డెఫ్ అండ్ డంబ్?.. అన్నాను. వాడి వ్యవహారం గ్రహించినట్టు- వదిలెయ్యొచ్చు కాదమ్మా.. అని యెవరో నాకు సలహానిస్తే- ఆ పిల్లకు పనేం వున్నట్టు లేదు.. అని మరెవరో అంటున్నారు. నాకు లెసన్ పీకిన వాళ్ళకు అవకాశం వచ్చినట్టే వుంది. లేడీస్ సీటు వొదిలేసి రావయ్యా బాబూ.. లేదంటే అసలే లేడీసు, వొదలరు.. అని యింకెవరో అంటున్నారు.

దాన్ని వెనక్కి రమ్మను.. నాన్న అమ్మని తినేస్తున్నారు. మీరు చెపితేనే లేదు, నేను చెపితే వింటుందా?.. అని అమ్మ. అది బస్సు కాకపోతే నాన్న నా చెంపా పగలగొట్టేవారే..

లేస్తావా? లేవవా?.. ఫిట్టు పట్టుకోవడం వొక్కటే తక్కువ. అడిగాను. లేదు అరిచాను. లేవను.. అన్నాడు. నీకు దిక్కున్న చోట

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Mahila+Gontuka+Matruka+October+2016**

* * *